# చరిత్రలో నిలిచేలా సంక్షేమ పాలన

- వైఎస్సార్‌సీపీ 58 నెలల పాలన జనరంజకం
- ఎమ్మెల్యే అభ్యర్థి విరూపాక్షి, జిల్లా జేసీఎస్ కన్వీనర్ సురేందర్ రెడ్డి విస్తృత ప్రచారం

దేవనకొండ: మరోసారి వైఎస్ జగనన్నకు అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి సాధ్యమవుతుందని, 58 నెలల పాలనలో సాహసోపేతమైన సంక్షేమ పథకాలను అమలుచేసి అర్హులైన ప్రతిఒక్కరికీ అందించిన ఘనత జగనన్నకే దక్కిందని వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బుసినె విరూపాక్షి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని పి.కోటకొండ, నెల్లిబండ, బండగట్టు గ్రామాల్లో ఓటర్లను కలిశారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బేతపల్లికి రోడ్డు వేయిస్తామని, హంద్రీ–నీవా కాలువ ద్వారా పి.కోటకొండకు నీరు సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్న తనకు ప్రజలు ఒక్క అవకాశం ఇచ్చి గెలిపించాలని అభ్యర్థించారు. జగనన్న ప్రభుత్వ హయాంలోనే రాష్ట్రం, పేదలు అన్నివిధాలా అభివృద్ధి చెందారన్నారు. ప్రతి మహిళకు ప్రభుత్వ పథకాలు, రుణాలు అందాయని గుర్తు చేశారు.


పి.కోటకొండలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థి విరూపాక్షి

### నమ్మక ద్రోహి గుమ్మనూరు జయరాం

వైఎస్సార్‌సీపీ తరఫున ఐదేళ్లపాటు మంత్రిగా కొనసాగిన గుమ్మనూరు జయరాం కన్న తల్లిలాంటి పార్టీకి వెన్నుపోటు పొడిచారని జిల్లా జేసీఎస్ కన్వీనర్, ఆలూరు అసెంబ్లీ ఎన్నికల అబ్జర్వర్ సురేందర్ రెడ్డి ధ్వజమెత్తారు. పార్టీ మారిన గుమ్మనూరు జయరాంను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. సీఎం జగనన్న చలువతోనే ఆయన ఎమ్మెల్యే, మంత్రిగా పదవులు పొందారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన ప్రతిఒక్కరూ వైఎస్సార్‌సీపీకే ఓటు వేసి మరోసారి గెలిపించాలని విన్నవించారు. పార్టీ నాయకులు దివాకర్‌నాయుడు, తపాల శ్రీనివాసనాయుడు, కో–కన్వీనర్ కబీర్‌దాసు, పి.కోటకొండ సర్పంచ్ తిమ్మక్క, మీనుగ కృష్ణ, లక్ష్మన్న, నెల్లిబండ సర్పంచ్ పద్మావతి, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.


హాజరైన ప్రజలు


పెద్ద కోటకొండలో విరూపాక్షికి మద్దతు తెలుపుతున్న ఉల్లి రైతులు

### అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తా

ఆలూరు: ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలన్నదే తన ఉద్దేశమని వైఎస్సార్‌సీపీ ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థి విరూపాక్షి అన్నారు. ఆయన మంగళవారం మండల కన్వీనర్ శ్రీనివాసులుతో కలిసి పి.కోటకొండ, నెల్లిబండ, దుప్పనగుర్తి, బండగట్టు గ్రామాల్లో పర్యటించారు. రైతులు, వ్యవసాయ కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలనలో అందించిన పథకాలను వివరించారు. మాజీ మంత్రి గుమ్మనూరు జయరాంలా అవినీతి అక్రమాలు చేసి దోచుకుని సంస్కృతి తనది కాదని, నియోజకవర్గంలోని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రైతులు ఆయనకు సంపూర్ణ మద్దతు తెలిపారు. స్థానిక నాయకులు వెంట ఉన్నారు.

## నీటి సమస్య తలెత్తకుండా చర్యలు

మద్దికెర: మండల పరిధిలోని ఎం.అగ్రహారం గ్రామంలో నీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు సర్పంచ్ బురుజుల విజయుడు తెలిపారు. మంగళవారం నీటి పథకాలకు సంబంధించి మోటార్లను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామానికి నీటిని సరఫరా చేసే పథకాలకు రెండేసి మోటార్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని నీరు సరఫరా చేస్తున్నామన్నారు. గ్రామంలో ప్రజలు నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలన్నారు. కొళాయి నీటిని వృథాగా కాలువల్లోకి వదిలితే చర్యలు తప్పవన్నారు.

## ఉపాధి పనుల పరిశీలన

దేవనకొండ: మండలంలోని తెర్నేకల్ గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను మంగళవారం సర్పంచ్ మొగతాళ్ అరుణ్‌కుమార్ పరిశీలించారు. కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొలతల పర్కారం పనిచేసి రోజుకు రూ.250 వేతనం పొందాలని సూచించారు. వలసలు వద్దు, ప్రభుత్వం కల్పించిన ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తాము ఉపాధి పనుల ద్వారా లబ్ధి పొందుతున్నామని, స్థానికంగా పనులు కల్పిస్తుండడం సంతోషంగా ఉందని ఉపాధి కూలీలు సర్పంచ్‌కు తెలియజేశారు.

## క్లుప్తంగా

### భక్తిశ్రద్ధలతో లక్ష్మమ్మవ్వ దేవర


బాలతండాలో అమ్మవారికి బోనాలు తీసుకెళ్తున్న భక్తులు

తుగ్గలి: మండల పరిధిలోని బాటతండాలో లక్ష్మమ్మవ్వ దేవర ఉత్సవాలను మంగళవారం తండావాసులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేకువజాము నుంచే అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం మహిళలు నెత్తిన బోనాలు పెట్టుకుని మేళతాళాలతో ఆలయానికి ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సమర్పించారు. తమ ఇష్ట దైవమైన అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాలకు బంధుమిత్రుల రాకతో తండాలో సందడి నెలకొంది.

### శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

చిప్పగిరి: సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ మహమ్మద్ రిజ్వాన్ హెచ్చరించారు. ఆయన మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతూ.. మండలంలోని సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఎన్నికల నేపథ్యంలో గ్రామాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

### సచివాలయ సిబ్బంది పాత్ర కీలకం

తుగ్గలి: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడంలో సచివాలయ సిబ్బందిదే కీలకపాత్ర అని ఎంపీడీఓ విజయలక్ష్మి అన్నారు. మంగళవారం గిరిగెట్ల, పగిడిరాయి, జొన్నగిరి సచివాలయాలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు, ప్రజలకు అందించిన సేవలకు సంబంధించి రికార్డులను పరిశీలించారు. సచివాలయాల ద్వారా అన్ని సేవలు ప్రజలకు అందించాలని సిబ్బందిని ఆదేశించారు. గిరిగెట్లలో అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు తప్పనిసరిగా పోషకాహారం అందించాలని అంగన్‌వాడీ టీచర్‌కు సూచించారు. ఎన్నికల కోడ్ దృష్ట్యా గ్రామాల్లో అక్కడక్కడ ఉన్న ఫ్లెక్సీలను, పోస్టర్లను తొలగించారు.

### ఎలక్ట్రీషియన్ మృతి


షాన్ నవాజ్ (ఫైల్)

పత్తికొండ రూరల్: పత్తికొండ మేజర్ గ్రామ పంచాయతీలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న షేక్ షాన్ నవాజ్ (48) మంగళవారం మృతి చెందాడు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న షాన్ నవాజ్ ఇంట్లోనే కన్నుమూశాడు. విషయం తెలుసుకున్న గ్రామ పంచాయతీ ఈఓ నరసింహులు సిబ్బందితో కలిసి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు రూ.15 వేలు ఆర్థిక సాయం అందించారు. అలాగే వైఎస్సార్‌సీపీ నాయకుడు పోచిమిరెడ్డి మురళీధర్‌రెడ్డి మృతుడి కుటుంబానికి రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు. మృతుడికి భార్య యాస్మిన్, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

### ఆధార్ సీడింగ్ తప్పనిసరి

తుగ్గలి: నేషనల్స్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌నకు 2019 నుంచి ఎంపికైన విద్యార్థులు ప్రస్తుతం 9, 10, 11, 12, తరగతులు చదువుతూ నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో నమోదు లేదా రెన్యూవల్ చేసుకున్న ప్రతి విద్యార్థి తమ బ్యాంకు అకౌంట్‌కు ఆధార్ సీడింగ్ చేయించుకోవాలని ఎంఈఓ–2 రామవెంకటేశ్వర్లు తెలిపారు. ఆధార్ సీడింగ్ లేకపోతే సదరు విద్యార్థి ఉపకార వేతనం వారి బ్యాంకు ఖాతాలో జమకాదన్నారు. విద్యార్థి తమ మెరిట్ కార్డు, ఆధార్ కార్డు, బ్యాంకు పాసుబుక్‌తో సంబంధిత బ్యాంకుకు వెళ్లి ఆధార్ సీడింగ్ చేయించుకోవాలన్నారు. న్యూఢిల్లీలోని విద్యా మంత్రిత్వశాఖ వారు నేరుగా విద్యార్థి ఆధార్‌కు సీడ్ అయిన బ్యాంకు ఖాతాలో నగదు రహిత లావాదేవీల ద్వారా ఉపకార వేతనాన్ని జమచేస్తారన్నారు. ఆధార్ సీడింగ్ కాకపోతే ఉపకార వేతనం జమచేయరని, స్టేటస్ కేవలం విద్యార్థి లాగిన్‌లో మాత్రమే తెలుస్తుందన్నారు.

### అందరికీ 'ఉపాధి' కల్పించండి


బనవాసిలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి

ఎమ్మిగనూరురూరల్: పనులు కావాలని అడిగిన కూలీలందరికీ ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించాలని డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి ఆదేశించారు. ఆయన మంగళవారం మండల పరిధిలోని బనవాసి గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను, నర్సరీలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. వేసవితో ఉపాధి పనులకు వచ్చే కూలీల సంఖ్య పెరగవచ్చునని చెప్పారు. కూలీలు ఉదయమే పనులకు వచ్చి త్వరగా ముగించుకుని ఇళ్లకు వెళ్లాలన్నారు. ఇతర ప్రాంతాలకు వలస వెళ్లకుండా ఉన్న ఊర్లోనే పనులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులు మొక్కలు, పండ్ల తోటల పెంపకంపై దృష్టి సారించాలన్నారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

# గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం

గోనెగండ్ల: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని వైఎస్సార్‌సీపీ యూత్ అధ్యక్షుడు బందెనవాజ్, జేసీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నాగరాజు సూచించారు. మంగళవారం మండలంలోని తిప్పనూరు, వీరంపల్లి, కున్నూరు, ఎస్ లింగందిన్నె గ్రామాల్లో 'మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందించిన సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ ప్రజల మద్దతు కోరాలన్నారు. పార్టీ మండల కన్వీనర్ దొరబాబు, నాయకులు పెద్దిరెడ్డి, వెంకటేష్, కృష్ణారెడ్డి, మద్దన్న, నాగేష్, తదితరులు పాల్గొన్నారు.


కున్నూరులో సిద్ధం కిట్లను అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

# మహిమాన్వితుడు హుచ్చు వీరప్ప స్వామి

ఆలూరు రూరల్: కొలిచే వారికి కొంగు బంగారమైన శ్రీ హుచ్చు వీరప్పతాత, మరకట్టు గ్రామంలో కొలువైన చలువప్ప తాతల రథోత్సవం గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా మండలంలోని పెద్దహోతూరు గ్రామంలో రథాన్ని ముస్తాబు చేస్తున్నారు. ఆలయాన్ని విద్యుత్తు దీపాలతో అలంకరించి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఉదయం గణపతి పూజ, సర్వ దేవతా మండలి పూజ తదితర పూజలు నిర్వహించి సాయంత్రం భక్తుల నడుమ రథోత్సవం లాగనున్నారు. 22వ తేదీన మహానివేదన, మహామంగళ హారతి, 23న ఉదయం గణపతి పూజ, సర్వ దేవతా మండల పూజ హుచ్చు వీరప్ప తాతకు పంచామృతాభిషేకం, సుదర్శన హోమం నిర్వహించి సాయంత్రం రథోత్సవం నిర్వహిస్తారు. అనంతరం చలువప్ప తాత ఉత్సవమూర్తిని ఊరేగించి గ్రామోత్సవం నిర్వహించి మరకట్టు గ్రామం చేరుతారని ఆలయ అర్చకులు చంద్రమౌళి స్వామి తెలిపారు. రథోత్సవం తిలకించేందుకు ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్ర నుంచి భక్తులు వేలాదిగా తరలిరానున్నారు. రథోత్సవం సందర్భంగా ఆలూరు నుంచి ఉచితంగా ఆటో ప్రయాణ సౌకర్యం కల్పించనున్నారు.


హుచ్చు వీరప్ప తాత మూలవిరాట్

### తుంగభద్ర జలాలతో అభిషేకం

పెద్దహాతూరు గ్రామంలో కొలువైన హుచ్చు వీరప్ప తాత భక్తులు ప్రతి ఏడాది పెద్దహోతూరు నుంచి హంపి క్షేత్రానికి వెళ్లి తుంగభద్ర నుంచి గంగాజలం తీసుకొచ్చి స్వామి వారికి ప్రత్యేక పూజలు అభిషేకం చేయనున్నారు. ఈ సంప్రదాయాన్ని ప్రస్తుతం కొనసాగిస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.

# కమనీయం.. మంగమాంబ రథోత్సవం


కరిడిగుడ్డంలో మంగమాంబ రథోత్సవం

ఆలూరు రూరల్: మండలంలోని కరిడిగుడ్డం గ్రామంలో కొలువైన అవధూత మంగమాంగ రథోత్సవం మంగళవారం సాయంత్రం కమనీయంగా సాగింది. ఉదయం నుంచి భక్తులు భారీఎత్తున తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం 6.30 గంటలకు అశేష భక్తజనం నడుమ రథాన్ని ఎదురు బసవన్న గుడి వరకు లాగారు. కరిడిగుడ్డం గ్రామ భక్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాల భక్తులు భారీ ఎత్తున తరలివచ్చారు. భక్తులకు ఆలయ కమిటీ నిర్వాహకులు అన్న ప్రసాదాలు పంచిపెట్టారు. రథోత్సవం సందర్భంగా ఎస్‌ఐ ఓబులేసు ఆధ్వర్యంలో పోలీసులు గట్టిబందోబస్తు నిర్వహించారు.

### కమ్మరచేడు మంగమ్మవ్వ రథోత్సవం

కమ్మరచేడు గ్రామంలో కొలువైన మంగమ్మవ్వ రథోత్సవం మంగళవారం కనుల పండువగా సాగింది. రథోత్సవం సందర్భంగా చుట్టుపక్కల గ్రామాల భక్తులతో పాటు ఆదోని, ఆలూరు మండలాల నుంచి భక్తులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాన్ని సందర్శించిన భక్తులకు అన్నప్రసాదాలు పంచిపెట్టారు.

## ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

హొళగుంద: మండలంలోని ఆయా కాలనీలలో మంగళవారం సర్పంచ్ చలవాది రంగమ్మ, పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు జరిగాయి. గ్రామంలోని కొర్చే వంక, తేరు బజారు, ఆయా ప్రధాన వీధుల్లోని డ్రైనేజీలలో చెత్త చెదారం, మురుగు నీటిని తొలగించారు. దోమలు ప్రబలకుండా బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. గ్రామస్తులు చెత్త చెదారాన్ని రోడ్డు, డ్రైనేజీల్లో వేయకుండా చెత్తను తీసుకెళ్లే ఆటోలు, ట్రాక్టర్లు వచ్చినప్పుడు అందులో వేయాలని సూచించారు. అలాగే మంచి నీటి పైప్‌లైన్లకు మరమ్మతు పనులు చేపట్టి లీకేజీలను అరికట్టారు. గ్రామస్తులు నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు.

# కాపీయింగ్‌కు పాల్పడితే చర్యలు

కృష్ణగిరి: ఇంటర్ ఓపెన్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని సిట్టింగ్ స్క్వాడ్ అధికారి సువర్ణలత హెచ్చరించారు. మంగళవారం ఆమె కృష్ణగిరి జిల్లా పరిషత్ పాఠశాల పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు. కేంద్రంలో 91 మంది విద్యార్థులకుగాను 88 మంది పరీక్షకు హాజరైనట్లు ఆమె తెలిపారు. అలాగే కృష్ణగిరి, కంబాలపాడులోని రెండు పరీక్షా కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలకు సంబంధించి 632 మంది విద్యార్థులకు గాను 624 మంది హాజరైనట్లు ఎంఈఓ సునంద తెలిపారు.

### కేంద్రాల వద్ద గుంపులుగా ఉండరాదు

మద్దికెర: పదో తరగతి పరీక్షలు జరుగుతున్న కేంద్రాల వద్ద ప్రజలు గుంపులుగా ఉండరాదని విద్యార్థులకు అసౌకర్యం కలిగిస్తే చర్యలు తప్పవని ఎస్‌ఐ రమేష్‌బాబు హెచ్చరించారు. మంగళవారం పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసి పరిసర ప్రాంతాలలో ఇతరులు రాకుండా చర్యలు చేపట్టారు. విద్యార్థులను కాపీయింగ్‌కు పాల్పడే విధంగా ప్రోత్సహిస్తే చర్యలు తప్పవన్నారు.

### రెండో రోజూ ప్రశాంతం

దేవనకొండ: మండలంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రెండోరోజూ మంగళవారం ప్రశాంతంగా జరిగాయి. తెర్నేకల్ జెడ్పీహెచ్‌ఎస్ ఏ–సెంటర్‌లో 233 మందికి గానూ 226 మంది హాజరు కాగా, ఏడుగురు గైర్హాజరయ్యారు. తెర్నేకల్ జెడ్పీహెచ్‌ఎస్ బి–సెంటర్‌లో 227 మందికి గానూ 218 మంది హాజరు కాగా, 9 మంది గైర్హాజరయ్యారు. దేవనకొండ జెడ్పీహెచ్‌ఎస్ పరీక్షా కేంద్రంలో 279 మంది విద్యార్థులకు గానూ 268 మంది హాజరు కాగా, 11 మంది గైర్హాజరయ్యారు. ఒకరు మాల్ ప్రాక్టీస్ చేస్తూ ఇన్విజిలేటర్‌కు చిక్కారు. సదరు విద్యార్థిపై చర్యలు తీసుకుంటున్నట్లు డిపార్ట్‌మెంటల్ అధికారులు తెలిపారు. అలాగే దేవనకొండలోని కేజీబీవీ పరీక్షా కేంద్రంలో 118 మంది విద్యార్థులకు గానూ 116 మంది హాజరవగా ఇద్దరు గైర్హాజరైనట్లు చెప్పారు.


దేవనకొండ: పరీక్షా కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు

# చంద్రబాబు హామీలను నమ్మి మోసపోవద్దు

ఎమ్మిగనూరుటౌన్: ప్రతిపక్ష నేత చంద్రబాబు ప్రజలకు ఇస్తామంటున్న పథకాలకు షూరిటీ, టీడీపీ భవిష్యత్తుకు గ్యారెంటీ లేదని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టారేణుక ఎద్దేవా చేశారు. మంగళవారం ఉదయం పట్టణంలోని 22వ వార్డులో కౌన్సిలర్ డిష్ కేశవరెడ్డి, పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇచ్చి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థించారు. ఎన్నికల సమయంలో మాయమాటలు చెప్పి మళ్లీ మోసగించేందుకు టీడీపీ నేతలు ప్రజల ముందుకు వస్తున్నారని, అలాంటి వారిని నమ్మవద్దని సూచించారు. 2014 ఎన్నికల్లో మోసపూరిత హామీలు ఇచ్చి అధికారం చేపట్టాక నెరవేర్చకుండా ప్రజలను నిండా ముంచారని గుర్తు చేశారు. ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో అవినీతికి తావులేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల వద్దకే సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగనన్నకే దక్కిందన్నారు. వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు బుట్టా రంగయ్య, అధికార ప్రతినిధి సునీల్‌కుమార్, రాష్ట్ర శాప్ నెట్‌వర్క్ చైర్మన్ మాచాని వెంకటేష్, నాయకులు మల్లెల ఆల్‌ఫ్రెడ్‌రాజు, కోటకొండ నరసింహులు, పాల శ్రీనివాసులురెడ్డి, సోమేష్, విశ్వనాథ్ రమేష్, కె.విశ్వనాథ్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు అబ్రార్, కౌన్సిలర్లు పూజేశ్వరి, వాహిద్, అమాన్, సుధాకర్, రామాంజినిరెడ్డి, వినయ్, తారా రాజశేఖర్, గట్టుఖాజ, బాష, రజాక్ తదితరులు పాల్గొన్నారు.

### స్వామివారిని దర్శించుకున్న బుట్టా రేణుక

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని కందనాతి గ్రామంలో చెన్నకేశవ స్వామి, మారెమ్మవ్వను ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు మంచి జరగాలని, మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని దేవుళ్లను కోరుకున్నట్లు చెప్పారు.


ఎమ్మిగనూరులో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక

### చేనేతల అభ్యున్నతికి కృషి

ఎమ్మిగనూరుటౌన్: చేనేతలు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ముచేయకుండా వారి అభ్యున్నతి కోసం కృషి చేస్తానని ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టారేణుక పేర్కొన్నారు. మంగళవారం రాత్రి పట్టణంలోని పద్మశాలి కళ్యాణ మండపంలో చేనేత మహిళలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో తనను గెలిపిస్తే ఎమ్మిగనూరులో యువత కోసం టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటుతో పాటు మూతపడ్డ పరిశ్రమలను తెరిపించి నేత పనికి పూర్వవైభవం తీసుకొస్తామని హామీ ఇచ్చారు. నాడు ప్రజలతో పాటు తాను కూడా టీడీపీ చేతిలో మోసపోయానని మరోసారి ఆ పార్టీ నాయకుల మాటలు విని మోసపోవద్దని సూచించారు. రాష్ట్ర కుర్ణికరికల కార్పొరేషన్ చైర్మన్ బుట్టా శారదమ్మ, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు బుట్టా రంగయ్య, జిల్లా వక్ఫ్‌బోర్డ్ ఉపాధ్యక్షుడు రియాజ్‌అహమ్మద్, వార్డు ఇన్‌చార్జ్ రాము, కౌన్సిలర్లు అంపమ్మ, శివప్రసాద్, అమాన్, నాగేషప్ప, వాహిద్, ఇషాక్, తదితరులు పాల్గొన్నారు.


ఆత్మీయ సమావేశానికి హాజరైన చేనేత మహిళలు

## కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు

గోనెగండ్ల: ప్రభుత్వ ఉద్యోగులు, వలంటీర్లు ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ సోనిబాయి హెచ్చరించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు.. ప్రభుత్వ అధికారులు, వలంటీర్లు రాజకీయ పార్టీలు నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొనరాదన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నాటి నుంచి కోడ్ అమల్లో ఉంటుందని, అధికారులు, ప్రజా ప్రతినిధులు నిబంధనలను ఉల్లంఘించరాదన్నారు. ఇప్పటికే మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న ఆయా రాజకీయ పార్టీలకు చెందిన నాయకుల విగ్రహాలకు ముసుగు వేయడం, ఫొటోలపై పెయింటింగ్, ఫ్లెక్సీలు తొలగించడం, అలాగే గోడలపై రాసిన రాతలను కూడా తొలగించడం జరిగిందన్నారు. ఉద్యోగులు ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే సస్పెన్షన్‌తో పాటు కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు.

## కర్ణాటక మద్యం స్వాధీనం


పట్టుబడిన కర్ణాటక మద్యంతో ఆలూరు పోలీసులు

ఆలూరు రూరల్: అక్రమంగా తరలిస్తున్న 10 బాక్సుల కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకుని ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు ఆలూరు ఎస్‌ఐ ఓబులేసు మంగళవారం తెలిపారు. వచ్చిన సమాచారం మేరకు.. ఆలూరు గ్రామ శివారులో వాహన తనిఖీలు చేస్తుండగా ఆలూరుకు చెందిన విజయ్, హాలహర్వి మండలం మాచనూరుకు చెందిన సూరి అనే వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 10 బాక్సుల కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకుని రెండు స్కూటర్లు సీజ్ చేశామన్నారు. కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

## అమ్మవారికి ప్రత్యేక పూజలు

నందవరం: మండల పరిధిలోని కనకవీడు గ్రామంలో దేవరలో భాగంగా భక్తులు మారెమ్మవ్వకు ప్రత్యేక అలంకారణ గావించి విశిష్ట పూజలు చేపట్టారు. పిండి వంటలతో నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక అమ్మ వారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆమెను పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీకాంతరెడ్డి, గ్రామ సర్పంచ్ మద్దీశ్వరి శాలువా, పూలమాలలతో సన్మానించారు. బుధవారం తెల్లవారుజామున కూష్మాండ బలిదానం నిర్వహించిన అనంతరం భక్తులు కలశాలతో ఊరేగింపుగా వెళ్లి కుంభాలతో నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకోనున్నారు.

## ఘనంగా మారెమ్మ దేవర


పూజలందుకుంటున్న మారెమ్మవ్వ

గోనెగండ్ల: మండల పరిధిలోని చిన్నమరివీడు గ్రామంలో మారెమ్మ దేవర మంగళవారం ఘనంగా జరిగింది. ఆలయంలో భక్తులు అమ్మవారిని పట్టువస్త్రాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం పూర్ణకుంభాలు మేళతాళలతో ఊరేగింపుగా వచ్చి బలిదానం కానిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజలు చేశారు. సాయంత్రం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. నాయకులు చంద్రశేఖర్, వాసు, బందెనవాజ్, దొరబాబు, క్రిష్టఫర్, రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

## బాలుడికి డెంగీ నిర్ధారణ


కప్పట్రాళ్లలో దోమల నివారణ మందును పిచికారీ చేస్తున్న దృశ్యం

దేవనకొండ: మండలంలోని కప్పట్రాళ్ల గ్రామంలో ఆరేళ్ల బాలుడికి డెంగీ నిర్ధారణ అయినట్లు మలేరియా సబ్‌యూనిట్ అధికారి సాయిబాబా తెలిపారు. ఈ మేరకు మంగళవారం గ్రామంలో దోమల నివారణ మందును పిచికారీ చేయించి, బాలుడి ఇంటి పరిసరాలు శుభ్రం చేయించారు. ఇంటి లోపల దోమల నివారణకు మందును పిచికారీ చేయించినట్లు చెప్పారు. ప్రజలకు దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. దోమకాటుకు గురికాకుండా ఇంటి పరిసరాలను ప్రజలు శుభ్రంగా ఉంచుకోవాలని, ఎక్కువ రోజులు నీటిని నిల్వ ఉంచుకోరాదన్నారు. రాత్రి వేళల్లో దోమ తెరలను వాడాలన్నారు. సూపర్‌వైజర్ రంగస్వామి, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎంలు, పంచాయతీ కార్యదర్శి, ఆశావర్కర్లు ఉన్నారు.

# మాతాశిశు సంరక్షణే ధ్యేయం

నందవరం: అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది మాతా శిశు సంరక్షణే ధ్యేయంగా పనిచేయాలని సీడీపీఓ సఫరున్నిసా బేగం సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లకు చిన్నారుల పెరుగుదలపై శిక్షణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పుట్టిన శిశువు నుంచి రెండేళ్ల వరకు చిన్నారుల పెరుగుదలపై పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే గర్భిణులు, బాలింతలకు, చిన్నారులకు టీకాలు తప్పనిసరిగా వేయించాలన్నారు. ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన కల్పించి పర్యవేక్షించాలన్నారు. పౌష్టికాహారం లోపంపై వచ్చే సమస్యలను వివరించాలన్నారు. పుట్టిన బిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే పౌష్టికాహారం తీసుకునేలా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లకు పోషణ్ పక్వాడాపై ప్రతిజ్ఞ నిర్వహించారు. హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాసులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుచరిత పాల్గొన్నారు.

## బైక్ ఢీకొని వ్యక్తి మృతి

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని ఆదోని రోడ్డు ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ముందు మంగళవారం సాయంత్రం రోడ్డు దాటుతుండగా బైక్ ఢీకొట్టడంతో బోయ తిక్కయ్య (61) మృతి చెందాడు. వివరాలు.. గుడేకల్ గ్రామానికి చెందిన బోయ తిక్కయ్య కొన్ని సంవత్సరాల క్రితం ఎమ్మిగనూరుకు వలస వచ్చి సాయిబాబా దేవాలయం ఎదురుగా ఉండే వీధిలో నివాసముంటున్నారు. సాయంత్రం రోడ్డు దాటి వచ్చి టీస్టాల్ వద్ద టీ తాగి తిరిగి ఇంటికి వెళ్తుండగా ఆదోనివైపు నుంచి వస్తున్న బైక్ ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ వ్యక్తిని చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ తిక్కయ్య మృతి చెందాడు. మృతుడికి భార్య ఈరమ్మ, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ప్రమాదానికి కారణమైన వ్యక్తి బైక్ వదలి పరారయ్యాడు. మృతుడి కుమారుడు నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసకొని విచారణ చేస్తున్నట్లు ట్రాఫిక్ పోలీసులు చెప్పారు.


బోయ తిక్కయ్య (ఫైల్)